## బీఆర్ఎస్‌నే గెలిపించండి

బీఆర్ఎస్ ప్రభుత్వంతోనే ప్రజలకు అభివృద్ధి, సంక్షేమ పథకాలు అందుతాయని కార్వాన్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి మిత్రకృష్ణ తనయుడు అభిషేక్‌మిత్ర అన్నారు. ఆదివారం జియాగూడ, గుడిమాల్కాపూర్, లంర్‌హౌస్ ప్రాంతాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఎమ్మెల్యే అభ్యర్థి మిత్రకృష్ణ తనయుడు అభిషేక్‌మిత్ర ఇంటింటా తిరుగుతూ ప్రజలకు కారు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కురుమ సంఘం యూత్ అధ్యక్షుడు తుమ్‌కుంట అరుణ్‌కుమార్, కావురి వెంకటేశ్, మంతటి నర్సింహులు, సి. బాబు, నరహరిచారి పాల్గొన్నారు. **- జియాగూడ, నవంబర్ 19**

## కాంగ్రెస్ మ్యానిఫెస్టో అభయహస్తం కాదు

కాంగ్రెస్ మ్యానిఫెస్టో అభయ హస్తం కాదని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు సంగిశెట్టి జగద్వీర్‌రావు విమర్శించారు .బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో మీడియా సమావేశంలో జగద్వీర్‌రావు మాట్లాడుతూ.. బడ్జెట్‌పై అవగాహన లేకుండా ఆదాయానికి మించి ఉందన్నారు. కర్నాటక రాష్ట్రంలో ఐదు గ్యారంటీలు ఇచ్చి ప్రజలను మోసం చేసారన్నారు. కార్యక్రమంలో మహ్మద్ ఇబ్రహిం, నవీన్‌కుమార్ పాల్గొన్నారు. **- రవీంద్రభారతి, నవంబర్ 19**

కార్వాన్ పరిధిలో అభివృద్ధి చేసే వారికే మీ ఓటు వేయాలని కార్వాన్ దర్బార్ మైసమ్మ దేవాలయ కమిటీ చైర్మన్, బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఠాకూర్ అమర్‌సింగ్ అన్నారు. ఆదివారం గుడిమాల్కాపూర్ తదితర ప్రాంతాలల్లో ఇంటింటా తిరుగుతూ ప్రజలకు కమలం గుర్తుకు ఓటు వేయాలని ఆయన ప్రజలను కోరారు. కార్యక్రమంలో నాయకులు యోగిరాజ్‌సింగ్, గోవర్ధన్, ప్రకాశ్, బంగారు రాధిక పాల్గొన్నారు. **- జియాగూడ, నవంబర్ 19**

గోషామహల్ నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో బీజేపీ అభ్యర్థి టి. రాజాసింగ్ కార్పొరేటర్లతో కలిసి ఆదివారం ప్రచారం చేపట్టారు. కార్పొరేటర్లు జి. శంకర్‌యాదవ్, రాకేశ్ జైస్వాల్, లాల్‌సింగ్‌లతో ఇంటింటికి తిరిగి ఓటు వేసి తనను గెలిపించాలని అభ్యర్థించారు. వందల కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులు చేపట్టామని, పెండింగ్ పనులు విజయం సాధించిన వెంటనే పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటానన్నారు. **- అబిడ్స్, నవంబర్ 19**

భారతి కల్చూరి సంవర్గీయ మహాసభ ఆధ్వర్యంలో భగవాన్ షహ్రాభాహు జయంతిని బొగ్గులకుంటలోని బీసీభవన్‌లో ఆదివారం నిర్వహించారు. జాంబాగ్ కార్పొరేటర్ రాకేశ్ జైస్వాల్, కుమార్ గౌడ్, అమర్‌నాథ్ జైస్వాల్, అజయ్ జైస్వాల్, రాజేందర్ జైస్వాల్ పాల్గొన్నారు. **- అబిడ్స్, నవంబర్ 19**

# ఘన విజయం సాధించడం ఖాయం

**గోషామహల్‌ను మంత్రి కేటీఆర్ దత్తత తీసుకుంటాననడం సంతోషకరం**

అబిడ్స్, నవంబర్ 19 : గోషామహల్‌లో బీఆర్ఎస్‌ని గెలిపిస్తే మున్సిపల్, ఐటీ శాఖ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు నియోజకవర్గాన్ని దత్తత తీసుకుంటానని చెప్పడం సంతోషకరమైన విషయమని బీఆర్ఎస్ అభ్యర్థి నందకిశోర్ వ్యాస్ బిలాల్ పేర్కొన్నారు. మంగళ్‌హాట్ డివిజన్ పరిధిలోని మంగళ్‌హాట్, పూసలబస్తీ, అర్ కె పేట్, మగ్ర, ఇందిరానగర్, గుఫానగర్ తదితర ప్రాంతాల్లో ఆదివారం నందకిశోర్ తన సతీమణి ఉమా దేవి వ్యాస్, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలతో ఇంటింటా తిరిగి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా నందకిశోర్ వ్యాస్ మాట్లాడుతూ.. మంత్రి కేటీఆర్ గోషామహల్ నియోజకవర్గాన్ని దత్తత తీసుకుంటే నియోజకవర్గంలో కోట్లాది రూపాయల అభివృద్ధి పనులు జరుగుతాయని తెలిపారు. శనివారం నిర్వహించిన మంత్రి కేటీఆర్ రోడ్‌షోలో మాట్లాడిన సందర్భంగా బీఆర్ఎస్‌ని గెలిపిస్తే ఇక్కడ తానే ఎమ్మెల్యే లాగా కోట్లాది రూపాయలతో అభివృద్ధి పనులు చేస్తానని చెప్పడంతో నియోజకవర్గం ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. ఇవే కాకుండా అనేక అభివృద్ధి పనులు చేస్తానని హామీని వ్వడం ఆనందంగా ఉందని పేర్కొన్నారు. గోషామహల్ నియోజకవర్గం ప్రజలకు 25 ఏండ్లుగా అందుబాటులో ఉండి అనేక సేవా కార్యక్రమాలను చేపట్టడం జరిగిందని వివరించారు. గోషామహల్ నియోజకవర్గం ప్రజల సహకారంతో ఘన విజయం సాధిస్తానన్నారు. తర్వాత బస్తీలలో పౌర సదుపాయాలను కల్పించేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటానని తెలిపారు. బీఆర్ఎస్ నాయకులు ఆనంద్‌కుమార్ గౌడ్, ఆనంద్‌సింగ్ మాట్లాడుతూ.. ప్రజల సహకారంతో గోషామహల్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ అభ్యర్థి నందకిశోర్ వ్యాస్ ఘన విజయం సాధించడం ఖాయమని దీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు ఎస్.ధన్‌రాజ్, చంద్రశేఖర్‌రెడ్డి, శ్రీనివాస్ యాదవ్, మనోహర్ గైక్వాడ్, బల్‌దీప్ సింగ్, ముఖేశ్ ముదిరాజ్, బుజ్జి పాల్గొన్నారు.

మంగళ్‌హాట్‌లో ప్రచారం చేస్తున్న గోషామహల్ బీఆర్ఎస్ అభ్యర్థి నందకిశోర్ వ్యాస్ బిలాల్



ఓటు అడుగుతున్న గోషామహల్ బీఆర్ఎస్ అభ్యర్థి నందకిశోర్ వ్యాస్

## కొనసాగుతున్న గ్రంథాలయ వారోత్సవాలు

నగర గ్రంథాలయ వారోత్సవాల్లో పాల్గొన్న ప్రతినిధులు

అబిడ్స్, నవంబర్ 19 : స్టాన్లీ మహిళా ఇంజనీరింగ్ కళాశాల లైబ్రరి, ఇన్ఫర్మేషన్ సెంటర్ ఆధ్వర్యంలో జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా మూడురోజుల పాటు నిర్వహించబోయే వర్క్‌షాప్ ప్రారంభమైంది. కళాశాల లైబ్రరియన్ ఎం.మాధవి వర్క్‌షాప్ కన్వీనర్‌గా వ్యవహరిస్తుండగా 20 వరకు వర్క్‌షాప్ జరుగుతుందని కన్వీనర్ మాధవి తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రొఫెసర్ ఎస్. సుదర్శన్‌రావు (పూర్వ విభాగాధిపతి లైబ్రరీ, సమాచార విభాగం ఉస్మానియా యనవర్సిటీ), కళాశాల డీన్ ప్రొఫెసర్ ఎ. వినయ్‌బాబు, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సత్యప్రసాద్ లంక, డైరెక్టర్ అకాడమిక్స్ అండ్ ఆడిట్ డాక్టర్ కనకదుర్గ, స్టూడెంట్స్ డైరెక్టర్ డాక్టర్ వి. అనురాధ, అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ ఎ రమేశ్, లైబ్రరీ కమిటీ సభ్యులు హాజరయ్యారు.

**లైబ్రరీతోనే జ్ఞాన సమపార్జన..**

కళాశాల డీన్ ప్రొఫెసర్ ఎ.వినయ్ బాబు మాట్లాడుతూ.. లైబ్రరీలు జ్ఞాన సమపార్జనకు ఉత్తమ ప్రదేశాలని అన్నారు. నేడు పుస్తకాలు చదివే అలవాటు తగ్గిపోయిందని వాపోయారు. సెల్‌ఫోన్లు, ఎలక్ట్రానిక్ పరికరాల వినియోగంతో పుస్తకాలు చదివే వారి సంఖ్య తగ్గిపోయిందని గుర్తు చేశారు. టెక్స్ట్‌బుక్స్, కథలు, నవలలు, వార్త పత్రికలు చదివే అలవాటు చేసుకోవాలని కోరారు. ప్రొఫెసర్ ఎస్. సుదర్శన్‌రావు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. పుస్తక ప్రచురణ, ఆర్టికల్స్ ప్రచురణలు తీసుకోవాల్సిన మెళకువలు అనే టాపిక్‌కు సంబంధించి మాట్లాడారు.

ప్రతిభ, ఆప్తమిత్ర పురస్కార గ్రహీతలతో కేవీ రమణాచారి, వెంకటరెడ్డి

## యువత భక్తి మార్గాన్ని అలవర్చుకోవాలి

- ప్రభుత్వ సలహాదారు డాక్టర్ కె.వి రమణాచారి

తెలుగు యూనివర్సిటీ, నవంబర్ 19 : యువత భక్తిమార్గాన్ని అలవర్చుకుంటే జీవితంలో ఉన్నతంగా రాణిస్తారని తెలంగాణ ప్రభుత్వ సలహాదారు డాక్టర్ కె.వి. రమణాచారి సూచించారు. జీవీఆర్ కల్చరల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రమణాచారి కార్యాలయంలో ప్రతిభ, ఆప్తమిత్ర పారితోషిక పురస్కారాల ప్రదానోత్సవ కార్యక్రమం ఆదివారం జరిగింది. ఆధ్యాత్మిక రచయిత డాక్టర్ పులిపర్తి కృష్ణమూర్తి అధ్యక్షతన జరిగిన ఈ సభలో రమణాచారి మాట్లాడారు. భారతీయ మూలాలను అధ్యయనం చేస్తూ సత్ప్రవర్తనతో యువత మెలగాలని పిలుపునిచ్చారు. సాహిత్య, సాంస్కృతిక, నృత్యం, కవిత, జానపదం, విద్యారంగాలకు సేవ చేస్తున్న పలువురికి నగదు పురస్కారాలు ప్రదానం చేసి, వారు చేస్తున్న సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో సాహితీవేత్తలు సయ్యద్ జానీ భాషా, టి.వి శిరీష, ఆర్. శ్రీలక్ష్మి, గదిబండ వెంకటరెడ్డి పాల్గొన్నారు.

## సహస్రార్జున మహారాజ్ జయంతి

సహస్రార్జున్ మహారాజ్ జయంతి సందర్భంగా ఆదివారం శోభాయాత్రను నిర్వహించారు. ఎస్.ఎస్.కె. సమాజ్ రహీంపురా హైదరాబాద్ తెలంగాణ స్టేట్ ఆధ్వర్యంలో పరిసర ప్రాంతాల్లో శోభాయాత్రను నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సమాజ్ మాజీ అధ్యక్షుడు రతన్ రాజేంద్ర, కాటిగర్ శంకర్‌రావు, నగరి లక్ష్మీనారాయణ, శివరతన్, హెచ్. కుమార్, దగుడు సురేశ్, రతన్ ముఖేశ్ పాల్గొన్నారు. **- అబిడ్స్, నవంబర్ 19**

## కళాప్రక్రియల్లో చిన్నారులను ప్రోత్సహించాలి

విద్యతో పాటు లలిత కళల్లో చిన్నారులను ప్రోత్సహించాలని ప్రముఖ వైద్యులు కరుణాకర్ రాపోలు పిలుపునిచ్చారు. కల్చరల్ ఫైన్ ఆర్ట్స్ ఆధ్వర్యంలో బిర్లా ప్రాంగణంలోని భాస్కర ఆడిటోరియంలో ఆదివారం ప్రతిభ కనబరిచిన చిన్నారి కళాకారులకు బాల మయూరి అవార్డులతో సన్మానించారు. సాయంత్రం శాస్త్రీయ సంప్రదాయ జానపద నృత్యాంశాల్లో శిక్షణ పొంది ప్రతిభ కనబరిచిన వారికి అవార్డులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా వక్తలు కల్చరల్ ఫైన్ ఆర్ట్స్ నిర్వాహకులు చేస్తున్న కృషిని ప్రశంసించారు. కార్యక్రమంర్ల ప్రముఖ సంఘసేవకులు బి. సురేశ్, డాక్టర్ వీరుజాడ, ఎం.వి. ఎన్. ప్రసాద్, వి.మహేశ్, వి.మురళీధర్, కల్చరల్ ఫైన్ ఆర్ట్స్ అధ్యక్షులు జి.ప్రభాకర్ రావు, సలహాదారు వి.వి.రమణ పాల్గొన్నారు. **- తెలుగు యూనివర్సిటీ, నవంబర్ 19**